ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



మేడ్చల్: మేడ్చల్ మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారిపై రోజూ ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నేతలు ట్రాఫిక్ పోలీసులను కోరారు. శనివారం నాయకులు మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వినతిపత్రం అందజేశారు. ట్రాఫిక్ పోలీసులు సమస్య పరిష్కారానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నేతలు భాస్కర్‌యాదవ్, నవీన్‌రెడ్డి తదితరులున్నారు.

నేడు కీసరలో బొడ్రాయి పూజలు

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర గ్రామం టెలిఫోన్ ఎక్స్‌చేంజ్ వద్ద నాభిశిల బొడ్రాయి బోనాలు ఆదివారం ఉదయం 7 గంటలకు నిర్వహిస్తామని, కమిషనర్ వెంకట్ రెడ్డి ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు, వివిధ దేవాలయాల చైర్మన్లు, వివిధ పార్టీల నేతలు, గ్రామపెద్దలు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లకు హైకోర్టు స్టేపై బంద్

మేడ్చల్: బీసీ రిజర్వేషన్లపై హేకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ.. ఈనెల 14న చేపడుతున్న రాష్ట్రబంద్‌లో అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు గోదా అరుణ్‌యాదవ్ కోరారు. అన్ని వర్గాల వారు ప్రధానంగా బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

న్యాయమూర్తి ప్రత్యేక పూజలు



గడి మైసమ్మ ఆలయంలో న్యాయమూర్తి శ్రావణి

మేడ్చల్: పట్టణంలోని గడి మైసమ్మ ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మేడ్చల్ కోర్టు న్యాయమూర్తి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మేడ్చల్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్/అడిషనల్ మెజిస్ట్రేటివ్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి శ్రావణి పూజల్లో పాల్గొన్నారు. న్యాయవాదులు, ఆలయకమిటీ సభ్యులున్నారు.

శ్మశానవాటిక కబ్జాపై ఫిర్యాదు



అహ్మద్‌గూడ శ్మశానవాటికను పరిశీలిస్తున్న హైడ్రా సిబ్బంది

కీసర: అహ్మద్‌గూడలోని శ్మశానవాటిక కబ్జా అవుతుందని గ్రామస్తులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం హైడ్రా అధికారులు శ్మశానవాటికను సందర్శించి కబ్జా అవుతున్న స్థలాన్ని పరిశీలించి ప్రాథమిక విచారణ చేపట్టారు. త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. హైడ్రా అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

శామీర్‌పేట్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం అలియాబాద్ మున్సిపాలిటీ, మజీద్‌పూర్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ఆర్‌వీఎం ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 379 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 73 మందిని ఆసుపత్రికి సిఫార్సు చేశారు. మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలతో నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ లక్ష్మణ్, గురుకుల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఆసుపత్రి వైద్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి పరిష్కారానికి కృషి

అల్వాల్: డివిజన్ రెడ్డి ఎన్‌క్లేవ్‌లో పెరుగుతున్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని శనివారం నూతన బోరు పనులను కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సాజిద్, యాదగిరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నెలన్నరకే ‘తారు’మారు !

నిర్మించిన నెలన్నరకే గుంతలు పడిన వైనం

- రూ. లక్షల ప్రజల సొమ్ము రోడ్డు పాలు
- నాణ్యత లోపమే కారణమంటున్న ప్రజలు



ఘట్‌కేసర్ అండర్‌పాస్ రోడ్డుపై ఏర్పడిన గుంత

ఘట్‌కేసర్: రవాణా సౌకర్యం కోసం ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏళ్లతరబడి ఉండాల్సిన రోడ్లు మూన్నాళ్లకే గుంతలుపడి దారుణంగా తయారవుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం సమస్యలకు దారి తీస్తోందని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినాయక నిమజ్జనానికి ఏదులాబాద్ చెరువుకు వచ్చే వందలాది వాహనాలు వెళ్లడానికి మూన్‌లైట్ వైన్స్ ఎదుట తారు రోడ్డు నిర్మించారు. నిర్మించిన నెలన్నరకే గుంతలు ఏర్పడటం నాణ్యత లోపానికి నిదర్శనంగా కనిపిస్తోంది.

నెలరోజులకే చిత్తడిగా..

నెల క్రితం నిర్మించిన రోడ్డుపై అప్పుడే గుంతలు ఏర్పడమేమిటని.. ? స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇంజినీరింగ్ అధికారుల అశ్రద్ధ స్పష్టంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతకు తిలొదకాలిచ్చి రోడ్డు నిర్మించిన ఇంజినీరింగ్ అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం...

ఏటా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఏదులాబాద్ వినాయకసాగర్ లక్ష్మీనారాయణ చెరువులోకి వందలాది వాహనాల్లో నగరం నుంచి తీసుకొస్తుంటారు. ఘట్‌కేసర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తేదని ఉప్పల్, ఈసీఐఎల్ వైపు నుంచి వాహనాలు పట్టణంలోకి రాకుండానే ఏదులాబాద్ చెరువుకు చేరుకోవడానికి అండర్ పాస్ వద్ద థార్ రోడ్డు నిర్మించారు. లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్డు పనుల్లో నాణ్యత లోపించడంతో అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి.

దెబ్బతింటున్న వాహనాలు..

వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగించే ఈ రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సర్వీస్ రోడ్డు నుంచి ఏదులాబాద్‌కు వెళ్లే వాహనాలు అండర్‌పాస్ రోడ్డు వైపు తిరిగే క్రమంలో పట్టణంలో నుంచి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో వైన్స్ ముందు ఏర్పడిన గుంతల్లో పడి వాహనాలు దెబ్బతింటున్నాయి. బురదగా మారి వాహనాలు దిగబడి పోతున్నాయి.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



నిర్మించిన మున్నాళ్లకే రోడ్డుపై అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– మంకయ్య, మర్పల్లిగూడ

చదును చేయకుండానే రోడ్డు వేశారు..



భూమి చదును చేయకుండానే రోడ్డు నిర్మించారు. వరద నీరు బయటకు వెళ్లేందుకు దారి లేక రోడ్డుపై నిలిచి గుంతలు ఏర్పడుతున్నాయి. వరద నీరు రోడ్డుపై నిల్వకుండా చర్యలు తీసుకోవాలి.

– సుధాకర్‌రెడ్డి, బొక్కొనిగూడ

పనుల్లో నాణ్యత లోపించింది



రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించిందనిపిస్తోంది. గుంతలు ఏర్పడకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలి.

– బొక్క రవీందర్‌రెడ్డి, బొక్కొనిగూడ

పారిశుద్ధ్యంపై కమిషనర్ పర్యటన



స్థానికులతో కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని సాయిసురక్ష కాలనీ, ఖుషిగార్డెన్, అయ్యప్ప కాలనీ ప్రాంతాల్లో ఉదయం 5 గంటల నుంచి కమిషనర్ వెంకట్‌రెడ్డి సిబ్బందితో కలిసి పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శుభ్రతపై పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు చేశారు. కీసరలో జరగనున్న బోనాల ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం నేడు జరిగే పల్స్ పోలియో కార్యక్రమ కేంద్రాల్లో పరిశీలించి, ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. పలువురు అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాదా బైనామా దరఖాస్తుల పరిశీలన



పరిశీలిస్తున్న తహసీల్దార్ రజిని, నాయబ్ తహసీల్దార్ రాజేందర్

ఘట్‌కేసర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సాదా బైనామా దరఖాస్తులను తహసీల్దార్ రజిని, నాయబ్ తహసీల్దార్ రాజేందర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. సాదా బైనామాపై ఇటీవల హైకోర్టు స్టే కొట్టివేయడంతో రెవెన్యూ అధికారులు ప్రక్రియను వేగవంతం చేశారు. 2020లో సాబా బైనామా కోసం మండలంలో 107 మంది దరఖాస్తు చేసుకోగా.. వారికి నోటీసులు జారీ చేశారు. సాదా బైనామా పేపర్‌తో పాటు భూవిక్రయదారులు, కొనుగోలు చేసిన వారి ఆధార్ వివరాలు పరిశీలించారు. భూమి అమ్మిన వారి దగ్గరి నుంచి సమ్మతి పత్రాలను తీసుకున్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జవహర్‌నగర్: ప్రధాన రహదారిని త్వరితగతిన పూర్తిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్ యాదవ్ శనివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 100 ఫీట్ల రోడ్డు కోసం ఇరువైపులా తవ్వడంతో వాహనదారులు పడి ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని, వర్షాలకు రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయి భారీ గుంతలు పడ్డాయన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రోడ్డును పూర్తి చేయాలని కోరారు.

వీధి దీపాల ఏర్పాటుకు చేయూత

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ముత్వెల్లిగూడలో బీఆర్ఎస్ సీనియర్ నేత చిట్టిరెడ్డి భరత్‌రెడ్డి సహకారంతో శనివారం మున్సిపల్ సిబ్బంది వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రిపూట ప్రజలు రహదారులపై వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నందున వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. లైట్లతో పాటు ఆటోమెటిక్ సెన్సార్‌లను ఏర్పాటు చేశామని వివరించారు.

రుణ లక్ష్యం పెంపు !

- 2,612 మహిళా సంఘాలకు రూ.197 కోట్ల రుణాలు
- ఇప్పటి వరకు 1,230 గ్రూపులకు రూ.85 కోట్లు అందజేత

సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేస్తున్నాయి. బ్యాంకుల నుంచి రుణాలు పొందిన సభ్యులు వివిధ రకాల కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు చేస్తూ.. కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా 2,612 మహిళా సంఘాలకు రూ.197 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ లక్ష్యం పెట్టుకోగా.. ఇప్పటి వరకు రూ.85 కోట్ల రుణాలను మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని అధిగమించి మహిళా సంఘాలకు రుణాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో లక్ష్యాన్ని పూర్తి చేయడం ద్వారా రాష్ట్రంలో మేడ్చల్-మల్కాజిగిరి మొదటి నుంచి ఐదు స్థానాల లోపు ర్యాంకును సాధించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రుణాలను పెద్ద మొత్తంలో అందజేసి, గతంలో మాదిరిగా తెలంగాణలో మొదటి నుంచి ఐదు స్థానాల లోపు సాధించటానికి ప్రయత్నిస్తామని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పేర్కొంటోంది.

◆ జిల్లాలోని ఘట్‌కేసర్ మండల పరిధిలో 281 సంఘాలకు రూ.22.28 కోట్లు , కీసర మండలంలో 236 సంఘాలకు రూ.16.21 కోట్లు, మేడ్చల్ మండలంలో 289 సంఘాలకు రూ.17.67 కోట్లు, ఎంసీపల్లిలో 208 సంఘాలకు రూ.11.36 కోట్లు, శామీర్‌పేట మండలంలో 216 మహిళా సంఘాలకు రూ.18.32 కోట్లు బ్యాంకు లింకేజీ కింద రుణాలు అందజేశారు.

స్త్రీనిధి రుణాలు కూడా..

స్త్రీనిధి కింద మహిళా సంఘాల కుటుంబసభ్యుల అవసరాల నిమిత్తం రుణాలను మంజూరు చేస్తున్నారు. ప్రధానంగా వ్యవసాయం, పిల్లల చదువు, ఆరోగ్యం, ఇతర చిన్న చిన్న ఉపాధి వ్యాపారాలకు ఈ రుణాలను మహిళా సంఘాలు వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే స్త్రీనిధి కింద జిల్లాలో గతేడాది కంటే అదనంగా రుణాలు అందజేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుసాగుతోంది.

లక్ష్యానికి మించి రుణాలు

జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి రుణాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.అలాగే, స్త్రీనిధి కింద కూడా రుణాలు అందజేస్తాం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న సభ్యులు ప్రతి నెల క్రమ తప్పకుండా కిస్తులు చెల్లించాలి.

– సాంబశివరావు, జిల్లా అధికారి గ్రామీణ అభివృద్ధి సంస్థ

ప్రారంభమైన చదరంగం పోటీలు



కాప్రా: జిల్లాస్థాయి చదరంగం పోటీలు కాప్రా విజయస్కూల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా స్థాయి అండర్–14, 17 చెస్ పోటీలు శనివారం స్కూల్ కరస్పాండెంట్ రాజేశ్వర్ ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 60 స్కూళ్ల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. రాజేశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని, విద్యాభివృద్ధిలో క్రీడలు భాగస్వామ్యమేనన్నారు. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంగబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కిష్టయ్య, ప్రభాకర్, సత్యనారాయణ, మదన్మోహన్‌రెడ్డి, వీరారెడ్డి, వినోద్, విద్యాసాగర్, యాదలక్ష్మి, సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలి



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పోచారం: సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొంటూ.. సామాజిక బాధ్యత తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బర్కత్‌పురాలోని ఆర్‌బీవీఆర్ఆర్ మహిళా ఫార్మసీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రతాపసింగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 4 రోజులుగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని అలవర్చుకోవడం అభినందనీయమన్నారు. ఓయూ ఎన్ఎస్ఎస్ అధికారి విద్యాసాగర్, కళాశాల ప్రిన్సిపాల్ సుమాకాంత్, ఎన్ఎస్ఎస్ కో– ఆర్డినేటర్ కుసుమ, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బద్దం కుమార్, మాజీ ఉప సర్పంచ్ అబేదాబేగం, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమాచారం హక్కు చట్టంపై అవగాహన

శామీర్‌పేట్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ యాదగిరిరెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రం శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంతో పాటు అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద ‘సమాచార హక్కు చట్టం– 2005 ’ పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలకు సమాచార హక్కు చట్టం గురించి వివరిస్తూ.. ప్రభుత్వ కార్యాలయంలో పారదర్శక పాలన కోసం ఈ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ కార్యాలయం నుంచి ఏదైనా సమాచారం కావాలంటే రూ.10 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకుంటే 30 రోజుల్లోగా సమాచారం ఇవ్వనున్నట్లు వివరించారు. గడువు లోగా సమాచారం ఇవ్వకుంటే మొదటి అప్పిలేట్ అథారిటీకి దరఖాస్తు చేయాలని, మొదటి అప్పిలేట్ అథారిటీ సమాచారం ఇస్తారని ఈ గడువు ముగిస్తే రాష్ట్ర సమాచార కమిషన్‌లో అప్పీల్‌కు వెళ్లొచ్చని స్పష్టం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త, ఆర్ఐ రాఘవ, ఎంఈఓ కమలాకర్, రెవెన్యూ సిబ్బంది, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, బిల్ కలెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు

హెల్మెట్ ఆవశ్యకతపై బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహ్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్, రోడ్డు సేఫ్టీ క్లబ్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ.. బైక్‌ర్యాలీ నిర్వహించారు. ‘హెల్మెట్ ధరించండి.. ప్రాణాన్ని రక్షించుకోండి’.. ‘డ్రైవ్ సేఫ్.. స్టే సేఫ్’ అంటూ నినాదాలు చేశారు. ప్రాణ రక్షణలో హెల్మెట్ ముఖ్యమని వివరించారు. సుమారు 250 మంది విద్యార్థులతో నారపల్లి, చౌదరిగూడ ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది. కళాశాల డైరెక్టర్ డా.సీవీ.కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు సతీష్‌కుమార్, కృష్ణ, వివిధ విభాగాల డీన్లు, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితేసేందుకు ‘టెక్ శక్తి-2025’



ఎంఓయూ పత్రాలతో ప్రిన్సిపాల్ మాధవిలత తదితరులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ‘టెక్‌శక్తి–2025’ పేరిట రెండ్రోజుల జాతీయస్థాయి మహిళా హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాధవిలత, టీజీఐసీ సీఈఓ మోరాజ్ ఫహీమ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినులు దేశాభివృద్ధికి దోహదపడే ప్రాజెక్టులను ఎంపిక చేసుకోవాలని, వాస్తవ జీవిత సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనే దిశగా ఆవిష్కరణలు, ఆలోచనలు ఉండాలని కోరారు.

◆ హ్యాకథాన్‌లో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినుల బృందాలు తమ ప్రాజెక్టులను ప్రదర్శించగా.. ఉత్తమ ప్రాజెక్టులకు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

టీజీఐసీతో ఒప్పందం...

మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ శనివారం తెలంగాణ ఇన్నొవేషన్ సెల్ (టీజీఐసీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, సీఈఓ మోరాజ్ ఫహీమ్‌లు ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. టీఐఈ సీనియర్ డైరెక్టర్ శాంతల వెయిగాన్, టీజీఐసీ కమ్యునికేషన్స్ లీడ్ సహిల్ సుమన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు వైద్యశాఖ సన్నద్ధం

- మేడ్చల్ జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారుల సంఖ్య 5.24 లక్షలు
- పల్స్ పోలియో కోసం 1,125 కేంద్రాల ఏర్పాటు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లకు సన్నద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా నేడు 5 ఏళ్లలోపు చిన్నారులకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సంబంధితశాఖల సమన్వయంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మెట్రోస్టేషన్లు పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. బస్తీలు, పారిశ్రామికవాడలు, తదితర ప్రాంతాల్లో పల్స్ పోలియో కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు.

నేటి నుంచి పల్స్ పోలియో..

కీసర: నేటి నుండి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కీసర ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనుజరెడ్డి తెలిపారు. కీసర పీహెచ్‌సీ పరిధిలోని వివిధ ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయిస్తామన్నారు.

5.24 లక్షల చిన్నారులు.. 1,125 కేంద్రాలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 5,24,973 మంది 5 ఏళ్ల లోపు చిన్నారులు ఉన్నట్లు గుర్తించిన జిల్లా వైద్యారోగ్యశాఖ 1,125 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 31 మొబైల్ టీమ్‌లు, 31 ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్యారోగ్యశాఖ పర్యవేక్షించనుంది. జిల్లాలో 337 హైరిస్క్ ఏరియాలను గుర్తించిన యంత్రాంగం అందుకు తగిన విధంగా పల్స్ పోలియో కార్యక్రమానికి చర్యలు తీసుకుంది. పల్స్ పోలియో కార్యక్రమంలో 5వేల మంది వైద్య సిబ్బంది భాగస్వామ్యాన్ని పంచుకోనున్నారు. వైద్యాధికారులు, సూపర్‌వైజర్ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో సహా ఇతర శాఖల ఉద్యోగులు కూడా పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొంటారు.

13 నుంచి ఇంటింటికీ..

ఈనెల13 నుంచి 15 వరకు గృహ సందర్శన ద్వారా పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తారు. సంబంధిత కేంద్రాల్లో పోలియో చుక్కలు వేసుకోని ఐదేళ్ల లోపు చిన్నారులకు గృహ సందర్శన ద్వారా వారికి పోలియో చుక్కలను వైద్య సిబ్బంది వేస్తారు.

పల్స్ పోలియో చుక్కలెందుకు... ?

పోలియో మెలిటీస్ అనే వైరస్ ద్వారా పోలియో వ్యాధి సోకుతుంది. వ్యాధి వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. ఈ వైరస్ రెండు రకాలుగా సోకుతుంది. ఒకటి అపరిశుభ్రమైన ఆహారాన్ని తినడం, రెండోది పోలియో వ్యాధికి కారణమయ్యే క్రిములు గొంతులోకి ప్రవేశించడం ద్వారా ఈ వ్యాధి సంభవిస్తుంది. ఈ క్రిములు రోగి కడుపులోకి ప్రవేశించి మలంలో ఎక్కువగా బహిర్గతమవుతూ ఉంటాయి. అపరిశుభ్రంగా ఉండటం, చేతులు, కాళ్లు సరిగ్గా కడుక్కోకపోవడం వల్ల కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి ఎక్కువగా ఒకటి, రెండేళ్ల పిల్లలకు ఎక్కువగా సోకడానికి అవకాశముంది. తర్వాత 3–4 ఐదేళ్ల చిన్నారులకు వచ్చే అవకాశం కూడా ఉంది. ఈ వ్యాధిని పల్స్ పోలియో చుక్కల ద్వారా నియంత్రించడానికి అవకాశం ఉంటుందని వైద్యారోగ్యశాఖ స్పష్టం చేస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించడానికి తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ఇంటింటికీ వైద్య సిబ్బంది వచ్చి టీకాలు వేస్తారు. దీనికి అందరూ సహకరించాలి. బస్తీలు, పారిశ్రామికవాడలు, బస్సు, రైల్వే, మెట్రోస్టేషన్ల వద్ద సైతం పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశాం.

– డాక్టర్ ఉమాగౌరి, డీఎంహెచ్ఓ

ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరి..



చంద్రప్రకాష్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్

మేడ్చల్: మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో పట్టణ ప్రజలు ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి కోరారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కేంద్రాల్లో చుక్కలు వేస్తారని ప్రకటించారు. పట్టణంలోని కిష్టాపూర్ బస్తీదవాఖాన, చెక్‌పోస్టు సీహెచ్‌సీ, మేడ్చల్ బస్తీ దవాఖాన(పాతగ్రామ పంచాయతీ),మున్సిపల్ కార్యాలయం, టీటీడీ కల్యాణమండపం, హరిజనవాడ ప్రైమరీ స్కూల్, వెటర్నరీ ఆసుపత్రి, ఈఎస్ఐ ఆసుపత్రి, ఉమానగర్ అంగన్‌వాడీ కేంద్రం, ఎన్‌జీఓ కాలనీ వాటర్‌ప్లాంట్, కేంద్రాలు రైల్వేస్టేషన్, బస్టాండ్, పోలియో మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.